విషాద శాకుంతలమ్

శకుంతల గురించి నాకు బాగా తెలుసు.

శకుంతల వేశ్య.

ఏడాది క్రితం నేను మొట్టమొదటి సారి శకుంతల దగ్గరికి వెళ్ళాను. వేశ్యల దగ్గరికి అందరూ ఎందుకు వెళతారో నేనూ అందుకే వెళ్ళాను.

అవసరాలే కాకుండా సరదాలు కూడా తీర్చగలిగే ఆదాయం వుంది నాకు. జీతం తక్కువే. పై రాబడి ఎక్కువ.

అడక్కుండానే చాలామంది లంచాలిస్తుంటారు నాకు.

నా ఉద్యోగం అలాంటిది.

చాలా అందమైన పెళ్ళామున్నవాణ్ణి చూసి అంతా అసూయపడ్డట్టే, అంత మంచి ఉద్యోగమున్నందుకు నన్ను చూసి కూడా, నన్నెరిగిన వాళ్లంతా లోపల్లోపల ఏడుస్తూ ఉంటారు.

అందుకు నేనేమీ చెయ్యలేను.

అయితే మా ఆవిడ మాత్రం మహా భయంకరంగా ఉంటుంది.

నా ఉద్యోగం చూసి ఏడిచేవాళ్లకి, మా ఆవిణ్ణి చూసినప్పుడు కాస్త కన్సొలేషన్ కలుగుతూ వుంటుంది. కొందరు నా పట్ల అప్పుడప్పుడూ సానుభూతి కూడా ప్రకటిస్తుంటారు.

మా ఆవిడ అంత అసహ్యంగా ఉండటానికి కారణం నాకు తెలియదు గాని, అంత అసహ్యంగా ఉండే అమ్మాయి మా ఆవిడ కావటానికి మాత్రం కారణం ఉంది.

పిల్లతో బాటు మంచి కట్నం ఇవ్వటమే కాకుండా, అంతకు మించి కామధేనువు లాంటి ఈ ఉద్యోగం కూడా ఇప్పిస్తానన్నాడు మా మామ.

నేనింకేమీ ఆలోచించలేదు. వెంటనే ఒప్పేసుకున్నాను. అందానిదేముంది? బజార్లో కొనుక్కోవచ్చు, అందుకు కావలసిన డబ్బుండాలే గాని!

ఇప్పుడు నాక్కావలసినంత డబ్బుంది. అందుకే నాక్కావలసిన అందాన్నీ, హాయినీ కావలసినప్పుడల్లా కొనుక్కుంటాను.

ఇలా కొనుక్కోవటం అలవాటయిన కొత్తలోనే శకుంతల నాకు పరిచయమైంది.

శకుంతల చాలా బాగుంటుంది, బాగుండేది.

శకుంతల ఇప్పుడు లేదు. చచ్చిపోయింది.

శకుంతల ఇక లేదు అనుకొన్న కొద్దీ ఆమె గురించిన ఆలోచనలు మరీ ఎక్కువవుతున్నాయి. మాటిమాటికీ గుర్తొస్తోంది.

ఏదైనా లాభముంటుందనుకుంటే తప్ప కట్టుకున్న పెళ్ళాన్ని కూడా అవసరాన్ని మించి గుర్తెట్టుకోని నా బోటివాడు, శకుంతల లాంటి మామూలు వేశ్యని ఇంతగా తలుచుకోవడం ఎవరికైనా ఆశ్చర్యంగానే ఉంటుంది. నాకూ అలాగే వుంది.

కాని, శకుంతలని మరిచిపోవడం కష్టం!

నేను మొట్టమొదటిసారి శకుంతల దగ్గరికెళ్ళినప్పుడు - బేరం కుదుర్చుకున్న దానికంటే మరో అయిదు రూపాయలు ఎక్కువిచ్చాను.

అప్పుడు శకుంతల చూసిన చూపు - నేనిప్పటికీ మరిచిపోలేదు. ఎప్పటికీ మరిచిపోలేను!

నేను స్కూటర్ కొనుక్కోకముందు ఉద్యోగంలో చేరిన కొత్త రోజుల్లో బస్సు లెంతసేపటికీ దొరక్క, ఆఫీసుకి ఆలస్యమైపోతుందేమోననీ, ఆఫీసరుతో చీవాట్లు తప్పవనీ భయపడుతున్న ఒక రోజున, రెండు మైళ్ళ దూరం పది నిమిషాల్లో చేర్చిన ముసలి రిక్షావాడికి, అతనడిగిన దానికంటే అయిదు పైసలెక్కువిస్తే - అతనలాంటి చూపే చూశాడు.

ఒకసారి ఆఫీసులో నా కింది గుమాస్తా పెళ్ళానికి జబ్బు చేసి ఆస్పత్రిలో చావు బతుకుల్లో ఉన్నపుడు – ఆ వేళే అందిన లంచం డబ్బులోంచి అతనడిగినంతా అప్పుగా ఇస్తే, అప్పుడతను అలాంటి చూపే చూశాడు.

ఆ వేళ శకుంతల అలా చూసినపుడు సిగ్గెరగని నాకే లోలోపల సిగ్గేసింది.

నిజానికి శకుంతలకి నేను చేసిందేమీ లేదు. ఆమెకి నేను దానం చెయ్యలేదు. ధర్మం చెయ్యలేదు. అమె నించి నేను పొందిన ఆనందానికి ప్రతిఫలంగా మరో అయిదు రూపాయలెక్కువిచ్చాను. అంతే, కాని నేనిచ్చిన ఆ అయిదు రూపాయలకీ ఆ ఒక్కచూపులో – శకుంతల చూపిన కృతజ్ఞతాభావానికి నాకున్న డబ్బంతా ఇచ్చినా విలువ కట్టలేననిపించింది ఆ వేళ.

ఉన్న మాట చెబుతున్నాను. డబ్బిచ్చి శరీరాలు కొనుక్కోగలం గాని, మనసులు కొనుక్కోలేం. మమతలు కొనుక్కోలేం. స్నేహాలు కొనుక్కోలేం. డబ్బు కోసం శరీరాలు అమ్ముకునేవాళ్ళు చాలా మందితో నాకు పరిచయం వుంది.

కాని, వాళ్ళలో చాలామందికి లేని గొప్ప మనసు శకుంతల కుంది.

అవసరాన్ని బట్టి నేను చిన్నవీ, పెద్దవీ అబద్ధాలాడతాను. అందుకెంత మాత్రమూ వెనకాడను. నల్లగా జిడ్డోడుతూ, ఛండాలంగా, అయిదు నిమిషాలదేపనిగా చూస్తే డోకొచ్చేట్టుగా ఉండే మా కంపెనీ యజమాని మొహాన్ని, తన్మయత్వంతో చూస్తూ, "మీ ఫేస్‌లో రాజేష్ ఖన్నా కట్స్ వున్నాయి సార్!" అని చాలా నమ్మకంగా చాలాసార్లు అన్నాను. ముక్కలు ముక్కలుగా నరికినా పాపం లేనివాణ్ణే పట్టుకుని "మీరేమీ అనుకోకపోతే మీ ఫొటో ఒకటిప్పించండి సార్. నేను ఇంట్లో పెట్టుకుని పూజ చేసుకుంటాను" అని కూడా అన్నాను.

ఇలాంటివే ఇంకా చాలా అబద్ధాలు అవసరాన్ని బట్టి, ఇంకా చాలా మందితో చాలాసార్లు ఆడాను.

కాని, శకుంతల గురించి మాత్రం నిజమే చెబుతున్నాను. ఇప్పుడసలు ఈ లోకంలోనే లేని శకుంతల గురించి అబద్ధం చెప్పవలసిన అవసరం నాకు లేదు.

శకుంతల గొప్ప ఆడది. ఒక్కసారి పరిచయమైతే ఏ మగాడూ కూడా జీవితాంతం మరిచిపోలేని ఆడది.

డబ్బుకు దొరికే ఆడవాళ్ళతో పరిచయాలే గాని, స్నేహాలు పెంచుకోవడం నాకు అలవాటు లేదు.

వాళ్ళ గురించీ, వాళ్ల జీవితాల గురించీ, వాళ్ళ సమస్యల గురించీ అనవసరంగా ఆలోచించి బుర్ర పాడుచేసుకోవడం కూడా నా కలవాటు లేదు.

డబ్బివ్వటం, నాక్కావలసింది వాళ్ళదగ్గర కొనుక్కోవటం, నలక్కుండా ముందే విడిచేసిన నా సిల్కుచొక్కా నేను తొడుక్కొని నా దారిని నేను రావటం – అంతే, నేను చేసేది.

అటువంటి నేను కూడా శకుంతలతో పరిచయం పెంచుకోవటమే కాకుండా, ఒకరకంగా స్నేహం కూడా చేశాను. అందుకు శకుంతల అందంలో ఉన్న ఆకర్షణ కంటే, ఆమె మనస్సులో ఉన్న గొప్పతనమే కారణం.

ఎంత గొప్పదయినా, ఎంత అందమైన ఆడదయినా శకుంతల వేశ్య.

బతకడం కోసం బజార్లో ఒళ్ళమ్ముకునే మామూలు వేశ్య. అలాంటి వాళ్లందరికీ ఉండే సమస్యలూ, బాధలూ, భయాలూ ఆమెకీ ఉన్నాయి.

శకుంతలతో పరిచయం పెరిగినకొద్దీ, నాకు తెలియకుండానే ఆమె శరీరంతోనే కాక, ఆమె వ్యక్తిగతజీవితంతో కూడా పరిచయం పెంచుకున్నాను.

శకుంతలది ఆ పట్నానికి పది మైళ్ళ దూరంలో ఉన్న ఒక పల్లెటూరు. వాళ్ళ నాన్నకి మొదట్లో కొద్దిగా భూమి ఉండేది. ఆ తరవాత అది పోయింది. శకుంతల ఎనిమిదో క్లాసువరకూ ఆ ఊళ్ళోనే చదువుకుని, పెద్దమనిషయ్యాక మానేసింది. మరి కొన్నాళ్ళకి వాళ్ళ నాన్న పోయాడు. అప్పులు మిగిలాయి.

బరువులూ, బాధ్యతలూ, భయాలూ, సమస్యలూ చాలా మిగిలిపోయాయి. ఇంటిల్లిపాదికీ ఆకలి మిగిలింది.

శకుంతల పల్లె నుంచి పట్నానికి ఎందుకొచ్చిందీ, వేశ్యగా ఎలా మారిందీ – ఆ కథంతా ఇప్పుడు చెప్పి విసిగించడం నా ఉద్దేశం కాదు. ఆ కథ చాలామందికి తెలిసిందే. ఇంకేరకంగానూ బతకలేని ఆడాళ్ళు – మరోవిధంగా కంటే ఒళ్ళమ్ముకుని బతకటానికే వీలు కల్పించే కారణాలూ, పరిస్థితులూ ఈ దేశంలో సవాలక్ష ఉన్నాయి. పైకి ఎవరూ ఒప్పుకోకపోయినా, ఈ సంగతి అందరికీ తెలిసిందే. అలా బతకడానికి కారణమైన కథలు చాలా మందివి ఒకలాగే ఉంటాయి. అందుచేత శకుంతల వేశ్యగా ఎలా, ఎందుకు మారిందీ ఇప్పుడు చెప్పటం అనవసరం.

కాని, శకుంతల వ్యక్తిగతజీవితానికి సంబంధించిన ఒక సమాచారం మాత్రం ఈ కథకి అవసరం.

శకుంతలకి జబ్బుతో ఉన్న ముసలి తల్లి, కూలి చేసుకుని బతకడానికి కూడా చాలని వయస్సున్న తమ్ముళ్ళతో పాటు, వయసొచ్చిన ఒక చెల్లెలు కూడా పల్లెలో ఉన్నారు. తల్లినీ, తమ్ముళ్ళనీ పోషించడంతో పాటు చెల్లెలికి పెళ్ళి చెయ్యాలన్న కోరిక కూడా శకుంతల కుంది. తనకి అందకుండా పోయిన జీవితాన్ని ఎలాగైనా సరే, చెల్లెలికైనా అందుబాటులోకి తేవాలని శకుంతల కలలు కంది.

శకుంతల చాలా అందంగా ఉండేదని మొదట్లోనే చెప్పాను. నాకు పరిచయమైన మొదట్లో అంత అందంగా, నిండుగా, ఆరోగ్యంగా మెరిసిపోతూ ఉండే శకుంతల శరీరం, రోజులు గడిచిన కొద్దీ శుష్కించి, ఎండిపోయినట్టవడం ప్రారంభించింది.

శకుంతల కిష్టమని తెలిసి ఒక నాటి రాత్రి ఆమె దగ్గరికెళ్ళినపుడు హోటల్ నుంచి కోడి పలావు కట్టించుకెళ్ళాను. ఒక్క మెతుకు మిగల్చకుండా ఆవురావురుమంటూ తినేసింది.

ఆవేళ అడిగాను "ఏమిటీ రోజు రోజుకీ ఇలా చిక్కిపోతున్నా"వని.

ఒళ్ళమ్ముకుని కూడా కడుపునిండా తినడానికి చాలని వాళ్ళు చాలామంది ఉంటారు. కాని శకుంతల మరీ అంత అధోగతిలో లేదు. ఆమె శరీరానికి ఖరీదు కాస్త ఎక్కువే.

నేనడిగిన ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పలేదు శకుంతల. నేను మళ్ళీ మళ్ళీ అడిగిన మీదట, అప్పుడు మెల్లగా నవ్వుతూ, "ఈ మధ్య ఒక్కపూటే అన్నం తింటున్నాను. రాత్రిళ్ళు ఎక్కువగా కూడా..." అని అర్థోక్తిలో ఆపేసింది.

నేను ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే అందుకు కారణం కూడా చెప్పింది శకుంతల – చెల్లెలి పెళ్ళికోసం డబ్బు కూడబెడుతున్నానని.

"నా బతుకు ఎట్టాగూ తగలడిపోయింది. దాన్నొక ఇంటి దాన్ని చేస్తే ఆ తరవాత నేను బతక్కపోయినా ఫర్వాలేదు. మా మేనత్త గారి అబ్బాయి ఒకడున్నాడు. రెండు మూడు వేలయినా కట్నం ఇస్తే గాని మా చెల్లెల్ని చేసుకోడు. అందుకే ఈ రకంగా..." అంది.

ఏమీ అనలేక ఒక్కసారి తల ఎత్తి శకుంతల కళ్ళలోకి చూశాను.

వాటిలో బలమైన నిర్ణయం కనిపించిది. అందమైన కలలు కనిపించాయి. అయినవాళ్ళ ప్రాణాన్ని కాపాడ్డంకోసం తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా రక్తదానం చేస్తున్న వ్యక్తిలో ఉండే తృప్తి కనిపించింది.

ఆ వేళ శకుంతల శరీరంతో ఆడుకోలేక పోయాను. ఇంటికి తిరిగి వచ్చేశాను.

ఇంకోసారి వెళ్ళినపుడు శకుంతల ఎప్పటికంటే ఆనందంగా కనిపించింది. ఏమిటని అడిగితే, తన చెల్లెలు పెళ్ళి దాదాపు నిశ్చయమైనట్టేనని, అందుక్కావలసిన డబ్బు కూడా దాదాపు పోగయినట్టేనని చెప్పింది.

ఆ రాత్రి నేనింటికి తిరిగొచ్చే ముందు ఎన్నడూ ఏమీ అడగని శకుంతల నన్నొక కోరిక కోరింది.

"మా చిట్టి పెళ్ళినాటికి పట్టుచీర కొనుక్కోవాలనుంది. నా దగ్గర డబ్బు మిగులుతుందో, లేదో? ఆ నాటికి నాకొక చీర కొనిపెట్టండి. మీ ఋణం ఉంచుకోను" అని అడగలేక అడగలేక అడిగింది.

అలాగేనని మాటిచ్చాను.

నిజానికి నేనే శకుంతలకి ఋణపడి ఉన్నాను.

పట్టుచీర కోసం పెళ్ళినాటి దాకా ఎందుకు, ఈ లోగానే కొనిపెడదాం, సంతోషిస్తుంది గదా అని, శకుంతల అడిగిన వారం పదిరోజులకి ఒకనాడు రెండు వందల రూపాయల్లో కాస్త మంచిదే ఒక చీర కొని తీసుకెళ్ళాను.

కాని, నేను వెళ్ళేసరికి శకుంతల లేదు. గుమ్మానికి తాళం వేసి ఉంది. ఇరుగు పొరుగు వాళ్ల నడిగాను.

"అదేమిటి? మీకు తెలియదా? శకుంతల నల్లుల మందుతాగి మొన్నే చచ్చిపోయింది" అన్నారు వాళ్ళు.

* * *

శకుంతల పోయి నెలరోజులైంది. అలవాటు ప్రకారం మళ్ళీ అందం కొనుక్కుందామని బజార్న పడ్డాను.

పరిచయమున్న బ్రోకరొకడు కనిపించి "కొత్త పిల్లుంది. బాగుంటుంది. చూత్తారా బాబుగారూ?" అనడిగాడు. మారుమాట్లాడకుండా అతని వెంట నడిచాను.

ఆ పిల్లని చూసి నేను కొయ్యబారిపోయాను. ఆ అమ్మాయికి పదిహేడు, పద్దెనిమిదేళ్ల కన్నా ఎక్కువ వుండవు. చాలా అందంగా వుంది.

అచ్చం శకుంతలలాగే వుంది. కాకపోతే ఒక చాయ తక్కువ. అంతే.

చెపితే గాని వీల్లేదని పట్టుపట్టిన మీదట ఏడుపు దిగమింగుతూ "శకుంతల మా అక్కాయే! నాకు పెళ్ళి చెయ్యాలని అక్కాయెన్నో ఆశలు పెట్టుకుంది. నా పెళ్లయితే నేను సుఖపడేదాన్నో కాదో నాకు తెలియదు. కాని పెళ్ళి చేసుకుని నా బతుకు నేను చూసుకుని వెళ్లిపోవడం నాకిష్టం లేకపోయింది. దరిద్రంతో అమ్మా, తమ్ముళ్ళూ పడే బాధలు నేను చూడలేకపోయాను. వాళ్ళ బాధలు తీర్చడానికి నేను కూడా ఏదో ఒకటి చెయ్యాలనుకున్నాను. అక్కాయి చేస్తున్న పనేంటో నాకు తెలుసు. పట్నం వచ్చి అక్కాయికి తెలియకుండా నేను కూడా అదే పని చెయ్యడం ప్రారంభించాను. నేను ఈ పని చేస్తున్నానని... అక్కాయికి తెలిసిపోయింది. ఆ మర్నాడే అక్కాయి నల్లుల మందు తాగేసింది. నాకు తెలుసు. అక్కాయిని నేనే చంపేశాను. నా చేతులారా నేనే చంపేశాను!" అని చెప్పి బావురుమంది ఆ పిల్ల. వరదలై పారే ఆమె కన్నీటి ప్రవాహంలో ఎక్కడ కొట్టుకుపోతానో అని భయం వేసి, త్వరత్వరగా అక్కణ్ణించి వచ్చేశాను.

★★★

శకుంతల పోయి ఇప్పకటిప్పుడే ఏడాది కూడా దాటిపోయింది.

పెళ్ళి కాకముందే రెండుసార్లు కడుపులు తీయించుకున్న మా బాస్ పెద్ద కూతురికీ వేళ అఫీషియల్‌గా గర్భాధానం జరుగుతోంది.

మా ఆవిడ అక్కడికి పేరంటానికెళుతూ. శకుంతలకని నేను కొన్న పట్టుచీర కట్టుకుంది.

శకుంతల ఈవేళ మరీ మరీ గుర్తొస్తోంది.

○

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక: దీపావళి ప్రత్యేక సంచిక - 27-11-1974)